క్లుప్తంగా

ఎస్‌ఐగా పవన్ కుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న పవన్ కుమార్

గూడూరు: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా పవన్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా పని చేస్తున్న నరేంద్ర అవుకు పోలీస్ స్టేషన్‌కు బదిలీ కావడంతో సీఐడీలో పని చేస్తున్న పవన్ కుమార్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎన్ అస్లామ్, బోయ లక్ష్మన్న, పలువురు కౌన్సిలర్లు ఎస్‌ఐని కలిసి పూల మాలలు వేసి స్వాగతం పలికారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

గూడూరు : పట్టణంలోని తూర్పు బీసీ కాలనీకి చెందిన ఎర్రమల కృష్ణ అనే వ్యక్తి చనిపోవడంతో ఆయన భార్యకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు అందించారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, మెప్మా సీఎంఓ సూర్య నారాయణ తదితరులు మృతుడి ఇంటి దగ్గరకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ బీమా తక్షణ సాయాన్ని మృతుడి భార్యకు అందించారు.

గృహ నిర్మాణాల పరిశీలన



కె.నాగలాపురంలో గృహ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సబియా పర్వీన్

గూడూరు రూరల్ : మండల పరిధిలోని కె.నాగలాపురంలోని జగనన్న కాలనీలో లబ్ధిదారులు చేపట్టిన గృహ నిర్మాణాలను బుధవారం మండల ప్రత్యేకాధికారి సబియా పర్వీన్ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. గృహ నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్‌ను అందిస్తున్నామని, పెండింగ్ లేకుండా బిల్లులు కూడా అందిస్తున్నామని, నిర్మాణాలకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. చాలా మంది లబ్ధిదారులు గృహాలను పూర్తి చేసుకున్నారని, మిగిలిన వాటిని కూడా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు.

రీ సర్వేతో భూ తగాదాలకు పరిష్కారం



పోలకల్‌లో రీ సర్వేను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ శేషఫణి

సి.బెళగల్: గ్రామాలలోని ప్రజల భూ తగాదాలను శాశ్వతంగా పరిష్కరించేందుకు రీ సర్వే దోహద పడుతుందని సి.బెళగల్ తహసీల్దార్ శేషఫణి అన్నారు. బుధవారం మండలంలోని పోలకల్ గ్రామంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది నిర్వహిస్తున్న రీ సర్వే పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వే అధికారులు, వీఆర్వోలతో తహసీల్దార్ మాట్లాడుతూ.. రైతులతో సౌమ్యంగా మెలిగి సర్వే పనులను పూర్తి చేయాలన్నారు. భూ సరిహద్దుల విషయంలో జాగ్రతలను వహించాలని, రైతులకు సర్వేపై సమగ్రంగా అవగాహన కల్పించి, న్యాయ బద్ధమైన సూచనలతో వారిని చైతన్య పరచాలని ఆదేశించారు. రీ సర్వే డీటీ కృష్ణమూర్తి, మండల ఇన్‌చార్జ్ సర్వేయర్ బాలునాయక్ తదితరులు ఉన్నారు.

దిశ యాప్‌తో మహిళలకు రక్షణ



గడివేముల బస్టాండ్‌లో దిశయాప్‌ను డౌన్‌లోడ్ చేస్తున్న మహిళ పోలీసులు

పాణ్యం/గడివేముల: దిశ యాప్ మహిళలకు ఎంతో రక్షగా ఉంటుందని గడివేముల ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య, పాణ్యం ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి అన్నారు. బుధవారం దిశయాప్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ముఖ్యమైన కూడళ్లలో మహిళా పోలీసులు, వలంటీర్లు, పోలీసు సిబ్బంది దిశయాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆండ్రాయిడ్ కలిగిన ప్రతి మొబైల్ ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు.

కంట్రోల్ బ్లాస్టింగ్ చేసేలా చూడండి

పాణ్యం : మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామంలో క్రషర్లు కంట్రోల్ బ్లాస్టింగ్ చేసేలా చూడాలని గ్రామస్తులు బుధవారం సర్పంచ్ బత్తుల విజయగౌరి, గ్రామ కార్యదర్శి రాజశేఖర్‌లకు వినతి పత్రం అందించారు. కంట్రోల్ బ్లాస్టింగ్ చేయకపోవడంతో రాళ్లు ఎగిరి పడుతున్నాయని, పొలాల్లోకి వస్తున్నాయన్నారు. అధికారులు జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులకు అండగా ఆర్బీకేలు!

- కియోస్క్‌తో అక్రమాలకు చెక్
- 48 గంటల్లోనే రైతుకు ఎరువులు, మందులు
- సంతోషం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

కోడుమూరు నియోజకవర్గంలోని రైతుభరోసా కేంద్రాలు	
మండలం	రైతుభరోసా కేంద్రాలు
కోడుమూరు	21
సి.బెళగల్	16
గూడూరు	08
కర్నూల్ రూరల్	25



పులకుర్తిలో కియోస్క్ యంత్రం ద్వారా ఎరువులను ఆర్డర్ పెట్టుకుంటున్న రైతులు(ఫైల్)

కోడుమూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. పెట్టుబడి సాయంతోపాటు విత్తు నుంచి దిగుబడుల విక్రయం వరకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తుంది. రైతుల సౌకర్యార్థం నెలకొల్పిన రైతుభరోసా కేంద్రాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఆర్బీకే సిబ్బంది పంటల సాగు సలహాలతోపాటు ప్రభుత్వం పథకాలపై రైతులను చైతన్య పరుస్తున్నారు. ప్రత్యేకించి రైతుభరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డిజటల్ కియోస్క్ యంత్రాల సేవలపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైతు తనకు ఏ ఎరువులు కావాలో స్వయంగా ఆర్డర్ పెట్టుకునేలా డిజటల్ కియోస్క్ సేవలను ప్రభుత్వం అందుబాటులోకి రావడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. నాణ్యమైన ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు కొనుగోలులో రైతులు మోసపోకుండా మెరుగైన సేవలను అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలను అందుబాటులోకి తేవడంతో పాటు, రైతులకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచింది. కోడుమూరు నియోజకవర్గంలో 87 రైతుభరోసా కేంద్రాలున్నాయి. రైతుభరోసా కేంద్రాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ కియోస్క్ సేవలు రైతులకు వరంలా మారాయి. వీటి వినియోగంపై సిబ్బందికి పూర్తిస్థాయిలో అధికారులు శిక్షణ ఇచ్చారు. డిజిటల్ కియోస్కతో ద్వారా రైతులకు తమకు కావాల్సిన నాణ్యమైన ఎరువులు, పురుగుల మందులు, వ్యవసాయ పరికరాలు, విత్తనాలు ఆర్డర్ చేసుకోవచ్చు. డిజిటల్ కియోస్క్‌కు టచ్ స్క్రీన్ ఉండడం వలన స్క్రీన్‌పై రైతులకు సంబంధించిన వివరాలన్ని డిస్‌ప్లే అవుతున్న వాటిని ఎంచుకొని ఆర్డర్ పెట్టుకోవచ్చు. మొదటగా రైతు ఫోన్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది... తద్వారా లాగిన్ కావాల్సి ఉంటుంది. రైతులకు కావాల్సిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్ల ధరలు చూసుకొని రైతుకు ఇష్టమైన వాటిని ఆర్డర్ ఇస్తే ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. ఆ మెసేజ్ సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్‌కు చూపి నగదును చెల్లిస్తే 24 నుంచి 48 గంటల్లో రైతులు కోరిన మందులు, ఎరువులు, విత్తనాలు రైతుభరోసా కేంద్రానికి చేరుతాయి. దీని వలన రైతులు నాణ్యమైన ఉత్పత్తులను పొందే అవకాశం ఉంది.

ఆర్బీకేలు రైతులకు వరం



రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుభరోసా కేంద్రాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. రైతుభరోసా కేంద్రాల్లోని కియోస్క్ యంత్రాల ద్వారా రైతులు తమకు అవపరమైన ఎరువులు, విత్తనాలను నేరుగా ఆర్డర్ చేసుకోవచ్చు. ప్రస్తుతం రైతులు ఎరువులను మాత్రమే నేరుగా ఆర్డర్ చేసుకుంటున్నారు.

– రవిప్రకాష్, ఏఓ, కోడుమూరు

రైతులకు ఉపయోగకరం



గతంలో ఎరువులు, మందులు కొనాలంటే చాలా ఇబ్బంది పడేవాళ్లం. వ్యాపారులు చెప్పిందే రేటు... వాళ్లు ఇచ్చిన వాటినే వాడాల్సి వచ్చేది. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో మాకు కావాల్సిన ఎరువులను, మందులను వాడుతున్నాం. నేరుగా తక్కువ ధరకే కొనగలుగుతున్నాం. కియోస్క్‌తో అక్రమాలకు అడ్డుపడింది.

– రైతు లక్ష్మన్న, కోడుమూరు

ధరలు అందుబాటులో ఉన్నాయి



రైతు భరోసా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచడం ఉపయోగకరంగా ఉంది. కియోస్క్ యంత్రం ద్వారా మాకు కావాల్సిన ఎరువులు, మందులు, విత్తనాలను ఎంచుకుంటున్నాం. ధరలు కూడా చూపిస్తుండడంతో అనుకూలంగా ఉంది. తద్వారా ఎక్కువ రేటుకు పెట్టి ఎరువులను కొనకుండా జాగ్రత్త పడుతున్నాం.

– రైతు తిప్పారెడ్డి, కోడుమూరు.

నీట్ ఫలితాల్లో సత్తా చాటిన గ్రామీణ విద్యార్థులు

కల్లూరు: మండలంలోని చిన్నటేకూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ–మెడికల్ అకాడమి విద్యార్థులు మంగళవారం రాత్రి వెలువడిన నీట్ ఫలితాల్లో సత్తా చాటారు. ఈ అకాడమిలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేద కుటుంబాలకు చెందినవారు. 2021–23 సంవత్సరంలో నీట్‌కు మొత్తం 43 మంది విద్యార్థులకు గాను 43 మంది ఎన్‌టీఏ నిర్వహించిన జాతీయ స్థాయి పరీక్షలో ఉత్తీర్ణత సాధించినట్లు అకాడమి డైరెక్టర్ డాక్టర్ రామసుబ్బారెడ్డి బుధవారం తెలిపారు. అకాడమికి చెందిన ఐదుగురు విద్యార్థులు 95 పర్సెంటైల్ పైన, 28 మంది విద్యార్థులు 90 పర్సెంటైల్ పైన మార్కులు సాధించారని వెల్లడించారు. అత్యధిక పర్సెంటైల్‌తో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు, అంకిత భావముతో కృషి చేసిన ఉపాధ్యాయ బృందమును ఐఐటి–మెడికల్ అకాడమి డైరెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

ఏపీఈఏపీసెట్‌లో ప్రతిభ

ఐఐటీ–మెడికల్ అకాడమికి చెందిన విద్యార్థులు బుధవారం వెలువడిన ఏపీఈఏపీసెట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అకాడమిలో 2021–23 సంవత్సరంలో ఇంజినీరింగ్ విభాగంలో 55 శిక్షణ పొందగా అందరూ ఏపీఈఏపీసెట్ పరీక్షలో ఉత్తీర్ణులైనట్లు అకాడమి డైరెక్టర్ డాక్టర్ రామసుబ్బారెడ్డి తెలిపారు.

ఉపాధిలో పని దినాలు పెంచాలి

కర్నూలు (న్యూటౌన్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉపాధి కూలీలకు పని దినాలు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడు డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు మండలం ఈ.తాండ్రపాడు గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో సమావేశమయ్యారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజలో పాల్గొన్న సర్పంచు గోవర్ధనమ్మ

ఓర్వకల్లు : మండలంలోని హుసేనాపురం గ్రామంలో బుధవారం నూతన ఆలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. గ్రామంలోని జాతీయ రహదారిపై ఉన్న శ్రీకృష్ణ దేవాలయాన్ని రోడ్డు విస్తరణలో భాగంగా హైవే అధికారులు కూల్చివేసిన విషయం విధితమే. ప్రస్తుతం అదే స్థలంలో టీటీడీ వారి సహకారంతో నూతన ఆలయాన్ని నిర్మించేందుకు పూనుకున్నారు. అందుగాను గ్రామ సర్పంచు చంద్ర గోవర్ధనమ్మ, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అర్చకులు జంధ్యాల మనోహర్‌శర్మ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచు గోవర్ధనమ్మ మాట్లాడుతూ, మొత్తం రూ.30 లక్షల వ్యయంతో నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అందులో ఆలయ నిర్మాణ నిమిత్తం టీటీడీ వారు రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. మిగతా సొమ్మును దాతల సహకారంతో విరాళాలు సేకరించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చంద్రపెద్దస్వామి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోర్డులో మారిన అధికారి పేరు

సాక్షి ఎఫెక్ట్



నేడు సచివాలయంలోని సమాచార బోర్డుపై ప్రస్తుత అధికారి పేరు రాసిన దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామ సచివాలయంలోని సమాచార హక్కు చట్టం 2005 బోర్డుకు గతంలో పని చేసిన అధికారి పేరే నేటికి దర్శనమిస్తోంది. ఈ విషయంపై ఈ నెల 11వ తేదీన 'సాక్షి' దినపత్రికలో 'అధికారి మారినా పేరు మారలేదు' అనే కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన దిన్నెదేవరపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి సి జాకీర్ హుస్సేన్ ప్రస్తుతం అప్పిలేట్ అధికారిగా ఉన్న కేఏ అజాంఖాన్ పేరును బోర్డులో రాయించారు. సమాచార హక్కు చట్టం బోర్డులో పేరు మార్చడంతో దిన్నెదేవరపాడు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యాకానుక కిట్ల పంపిణీ



విద్యా కానుకను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఓర్వకల్లు : ప్రభుత్వం పేద విద్యార్థులకు జగనన్న విద్యా కానుకను అందజేయడం అభినందనీయమని ఎంపీపీ తిప్పన్న అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ఓర్వకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం మంజూరు చేసిన విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఎన్నో బృహత్తర కార్యక్రమాలు చేపడుతుందన్నారు. మనబడి నాడు నేడు కింద పాఠశాలల రూపురేఖలు మార్చి కార్పొరేట్ స్థాయిలో అత్యాధునిక సదుపాయాలు సమకూర్చిందన్నారు. ఈ ఏడాది పదో తరగతిలో ప్రతిభ కనపరచిన వారికి వరుసగా రూ.3,000, రూ.1,500, రూ.1,000 ల చొప్పున అందజేస్తామని ఎంపీపీ ప్రకటించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, ఎంపీటీసీ సభ్యురాలు షాకిరున్నీషా, హెచ్ఎం పి. రామచంద్రారెడ్డి, స్థానిక నాయకులు శంకర్‌రెడ్డి, పీఎంసీ చైర్మన్ మద్దిలేటి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: మండల పరిధిలోని కొర్రపోలూరు గ్రామంలో బుధవారం రామలింగేశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. గ్రామంలోని పురాతన ఆలయాన్ని పునః నిర్మించారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా గ్రామస్తులు పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. అనంతరం స్వామి వార్ల విగ్రహాలకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ మోహన్‌తో పాటు చైర్మన్ మాచెర్ల, గ్రామపెద్ద రామసుబ్బారెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధానాచార్యులు కేశవయ్య ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

భక్తిశ్రద్ధలతో హోమాలు



హోమాలు చేస్తున్న దృశ్యం

పాణ్యం : మండల పరిధిలోని నెరవాడ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశవ, సీతామారాంజనేయ, నాగేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. శ్రీ శోభకృత్ నామ సంవత్సరం అష్టోత్తర శత (108)ఏకాదశి పూర్తి అయిన సందర్భంగా స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున నుంచి అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. భక్తులు గణపతిపూజ. విష్ణుసహస్ర పారాయణం చేశారు. అనంతరం రాత్రి 10గంటలకు గ్రామంలోని పుర్వీకుల భజన సంఘం జ్ఞాపకార్థం రాష్ట్ర స్థాయి భజన పోటీలు నిర్వహించారు.

నిండుకుండలా గార్గేయపురం చెరువు



నీటితో కళకళలాడుతున్న గార్గేయపురం చెరువు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలంలోని గార్గేయపురం చెరువు వేసవిలోనూ నీళ్లతో నిండుకుండలా కళకళలాడుతోంది. నాలుగేళ్ల క్రితం పూర్తి స్థాయిలో చెరువు ఎండిపోయింది. మూడేళ్లుగా సమృద్ధిగా వర్షాలు పడడంతో వర్షం నీరుతో నిండుగా ఉంది. అలాగే ఏపీ టూరిజం ఆధ్వర్యంలో స్పీడ్ బోటింగ్ ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంత వాసులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు సైతం స్పీడ్ బోటింగ్‌తో ఎంజాయ్ చేస్తున్నారు.

గడప గడపకూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



గోరంట్లలో గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను లబ్ధిదారురాలికి అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎవరి ప్రమేయం లేకుండా గ్రామ సచివాలయాలు, వలంటరీ వ్యవస్థ ద్వారా నేరుగా ప్రజల గడప గడపకు చేరుతున్నాయని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. బుధవారం మండలంలోని గోరంట్ల గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ గ్రామ సర్పంచ్ బాలక్రిష్ణతో కలిసి గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల అమలు తీరును వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. కుళాయిలకు నీరు సక్రమంగా రావడం లేదని, తమకు గృహాలు మంజూరు చేస్తే పాత ఇళ్ల స్థానంలో కొత్తవి నిర్మించుకుంటామంటూ ఎస్సీ కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే నీటి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, అర్హులైన వారిని గుర్తించి గృహాలు మంజూరు చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, హౌసింగ్ డీఈఈ వాసుదేవరావుకు సూచించారు. ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు వర్తించిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ వివరాల మేరకు ప్రభుత్వ ఫలాలు అందాయా... లేదా అని లబ్ధిదారులను అడగ్గా అందాయంటూ వారు సంతోషంగా చెప్పారు.

ప్రతి పేదవాడు ఆర్థికాభివృద్ధే లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గోరంట్ల గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రతి పేదవాడు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ఫలాలలను లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నారన్నారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక చంద్రబాబు పచ్చమీడియాను అడ్డుపెట్టుకుని అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజల వద్దకే పాలన సాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఏఈ గంగరాజు, ఏపీఎం పుష్పావతి, స్థానిక వైసీపీ నేతలు వేణుగోపాల్‌రెడ్డి, బాలు, నాయుడు, మనోహర్, గోపాల్, మద్దయ్య, లాయర్ ప్రభాకర్, బలరాం, సచివాలయ సిబ్బంది, హెల్త్ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

కర్నూలు (న్యూటౌన్): జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలను అరికట్టాలని కర్నూలు ఎంపీడీఓ కార్యాలయ ఏఓ భాస్కర్‌నాయుడు అన్నారు. బుధవారం జెడ్పీలోని కర్నూలు ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి బాల్య వివాహాల నిరోధక. పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఏఓ మాట్లాడుతూ మండల స్థాయి బాల్య వివాహాల నిరోధక, పర్యవేక్షణ కమిటీ సభ్యులు గ్రామీణ ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. అదే విధంగా బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలని అన్నారు. సమావేశంలో లేబర్ ఆఫీసర్ రాంప్రసాద్, డాక్టర్ విజయమాధురి, ఐసీడీఎస్ సిబ్బంది విజయలక్ష్మి, పద్మావతి, ఎస్‌ఐ గోపాల్, ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసీ కాల్వకు 104 క్యూసెక్కులు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుండి కేసీ కాల్వకు 104 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు బుధవారం డ్యామ్ అధికారులు తెలిపారు. కర్నూలు నగర ప్రజల తాగు నీటి అవసరాల కోసం ఈ నీటిని విడుదల చేశామన్నారు. డ్యామ్‌లో 1.110 టీఎంసీల నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

16న సంసద్ ఆదర్శ గ్రామ యోజన సమావేశం

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 16వ తేదీన శనివారం ఉదయం 10.30గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో ఆదర్శ గ్రామ యోజనపై సమావేశం ఉంటుందని కర్నూలు ఎంపీడీఓ అజాం ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన అధ్యక్షతన జరగనుందన్నారు. మండల పరిధిలోని అన్ని శాఖలకు చెందిన అధికారులందరూ ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ప్రతిరోజూ 'స్పందన' నిర్వహించాలి

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండల పరిధిలోని 25 గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు 'స్పందన' కార్యక్రమం తప్పకుండా నిర్వహించాలని సచివాలయ ఉద్యోగులను కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్ ఆదేశించారు. బుధవారం కర్నూలు మండలం నిడ్జూరు, జి శింగవరం గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

శ్రీలక్ష్మీమాధవస్వామి ఆలయాభివృద్ధికి కృషి



ఆలయ కమిటీ సభ్యుల చేత ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్ : గోరంట్ల శ్రీలక్ష్మీమాధవ స్వామి ఆలయాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. బుధవారం మండలంలోని గోరంట్ల గ్రామంలో శ్రీలక్ష్మీ మాధవస్వామి ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గోరంట్ల మాధవస్వామి ప్రజల ఇలవేల్పుగా ఉంటూ పూజలందుకుంటున్నారని, వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ఆలయాభివృద్ధికై తన వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు స్వామి సన్నిధిలో త్వరలో గోశాల నిర్మాణాన్ని చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే ఆలయ గోపురానికి తన స్వంత ఖర్చులతో రంగులు వేయించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. నూతనంగా ఎన్నికైన పాలకమండలి సభ్యులు ఆలయాభివృద్ధికి కృషి చేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన ఆలయ కమిటీ చైర్మన్ అరువు నారాయణ, సభ్యులు సద్దల మనోహర్, పూజారి వెంకటరమణ, శ్యామలమ్మ, ఎల్లేశ్వరీ, మధుమోహన్, లక్ష్మీదేవి, మద్దమ్మలను ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు బాలకృష్ణ, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, ఆలయ ఈఓ గుర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయండి



బురాన్‌దొడ్డిలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారిణి శ్యామల

సి.బెళగల్: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు పనిచేయాలని, సమన్వయంగా వ్యవహరించి పేదలకు న్యాయం చేయాలని మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల సూచించారు. బుధవారం ఎంపీడీఓ రాముడుతో కలిసి ఆమె మండలంలోని పోలకల్, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, కె.సింగవరం గ్రామాలలో పర్యటించారు. మండల కేంద్రం సి.బెళగల్‌లోని అంగన్‌వాడీ కేంద్రం – 6ను తనిఖీ చేసిన డీడీ కేంద్రం నిర్వహణ తీరుపై మండిపడ్డారు. అదేవిధగా బురాన్‌దొడ్డి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అదేవిధంగా బురాన్‌దొడ్డిలో జగనన్న కాలనీని సందర్శించి గృహ నిర్మాణాల వివరాలను హౌసింగ్ ఏఈ సుమంత్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని సచివాలయాన్ని తనిఖీచేశారు. అనంతరం సి.బెళగల్, కె.సింగవరం గ్రామాలలోని మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మినీ ఫిష్‌ఆంధ్ర షాప్‌లను తనిఖీ చేశారు.

నేడు 'ఆణిముత్యాల' ప్రదానోత్సవం

కోడుమూరు: నియోజకవర్గ స్థాయిలో 10వతరగతి, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గురువారం ఉదయం కోడుమూరులోని బాలుర హైస్కూల్లో నిర్వహించే జగనన్న ఆణిముత్యాలు అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేస్తున్నట్లు ఎంఈఓ అనంతయ్య బుధవారం తెలిపారు.

సకాలంలో టీకాలు వేయించాలి



వ్యాక్సిన్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కల్లూరు : 0 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను క్రమం తప్పకుండా సకాలంలో ఇవ్వాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రామగిడ్డయ్య అన్నారు. బుధవారం పర్ల గ్రామంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ వాక్సిన్‌ను సరైన పద్ధతిలో వేయాలన్నారు. వాక్సిన్ కారియర్ నందు వాక్సిన్ వీవీఎమ్(వాక్సిన్ వాయల్ మనిటరింగ్) ఉన్నయా అని తనిఖీ చేశారు. పిల్లలకు ఇవ్వవలసిన వాక్సిన్‌లను వివరాలను ఎమ్‌సీపీ కార్డు నందు నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సల్కాపురం జరుగుతున్న ఫ్యామిలీ ఫిజిషియన్ సేలను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.